క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చెన్నారావుపేట : మండలంలోని పుల్లయ్య బోడు గ్రామ పంచాయతీ పరిధిలోని అజ్మీరా తండా నుంచి ధర్మతండా వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బోడ సమ్మ నాయక్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సహకారంతో ఎంపీటీసీ నిధులు రూ. లక్ష మంజూరు కావడం జరిగిందన్నారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

'న్యాయం చేయండి'

పర్వతగిరి : ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూమిని ఓ వ్యక్తి అక్రమించి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన రంపె సోమన్న ఆదివారం ప్రకటనలో తెలిపాడు. సర్వే నంబర్ 109/ఎ2లో ఉన్న తమ భూమిలో పంట సాగు చేసుకుంటుండగా పెద్దతండాకు చెందిన నూనావత్ గణేష్ పంటను ధ్వంసం చేశాడన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమ భూమి తమకు అప్పగించి న్యాయం చేయాలని కోరారు.

మండల కమిటీ ఎన్నిక



సంగెం : బీజేపీ ఎస్టీ మోర్చా కమిటీని మండల అధ్యక్షుడు మహేందర్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా బాదావత్ మదన్ నాయక్, గుగులోత్ నవీన్ నాయక్, ప్రధాన కార్యదర్శులు భూక్యా వెంకన్న, గుగులోత్ యుగేందర్, కార్యదర్శులు లావుడ్యా నటరాజ్, మూడు వినోద్, సోషల్ మీడియా ఇన్‌చార్జులుగా లావుడ్యా రాజు, బానోత్ నవీన్, భూక్యా శ్రీరామ్‌ను నియమించినట్లు తెలిపారు.

మసీద్ కమిటీ..



ఖానాపురం : మసీద్ కమిటీ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన షేక్ ముస్తఫా ఎన్నికయ్యారు. మసీద్ కమిటీ ఎన్నికలను ఆదివారం ఖలీంపాష, ఖాజాపాషల ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి షేక్ ముస్తఫా, షేక్ గులాం మహ్మద్‌లు పోటీలో నిలబడ్డారు. ఇందులో భాగంగా ముస్తఫాకు 87 ఓట్లు, మహ్మద్‌కు 34ఓట్లు పడ్డాయి. దీంతో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి



నర్సంపేట : నియోజకవర్గంలోని హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పైసా గణేష్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సంక్షేమ హాస్టళ్లను కొయ్యల మోహన్ అధ్యక్షతన ఆదివారం సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో మరుగుదొడ్లు సరిగా లేకపోవడం వల్ల డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి అనేక రోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. తక్షణమే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినయ్, ప్రవీణ్, రాము, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

శాయంపేట : మండలంలోని కొప్పుల, పెద్ద కోడెపాక గ్రామాలకు చెందిన గుండారపు రాజక్క, తడక కొమురయ్య, మంద సమ్మయ్య ఇటీవల మృతి చెందారు. కాగా బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉద్యమకారులకు అండగా ఉంటా..

ఆత్మకూరు : తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటానని మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌లో ఉద్యమకారుడు బాబుమియాపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడిచేశారని తెలుసుకొని ఆయనను ఆదివారం పరామర్శించారు. ఈసందర్భంగా మధుసూదనాచారి బాబుమియాతో మాట్లాడి దాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా ఉద్యమకారులకు తగిన న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు అంకతి రవి, సాంబరెడ్డి, రాజు పాల్గొన్నారు.

దారి కబ్జాపై చర్యలేవి..?

- ఫిర్యాదుచేసినా ఫలితం శూన్యం..
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



కబ్జాకు గురైన దారిని పరిశీలిస్తున్న రైతులు (ఫైల్)

నల్లబెల్లి : తాతల కాలం నాటి నడక దారిని రోడ్డుకు ఇరువైపుల ఉన్న రైతులు ఒకరిని చూసి మరొకరు కబ్జాకు పాల్పడుతున్నారు. రోడ్డుకు కబ్జాకు గురికావడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. మండలంలోని రుద్రగూడెం జాతీయ రహదారి నుంచి ఎర్రకుంట మీదుగా మామిండ్లవీరయ్యపల్లి రోడ్డు వరకు ఉన్న 33 ఫీట్ల లింకు రోడ్డు పూర్తిగా కబ్జాకు గురైయింది. దీంతో పంట పొలాలకు వెళ్లాల్సిన రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దారి ఉన్నట్లు ఆధారాలున్నాయని తెలియజేస్తూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్యను పరిష్కరించే నాథుడే కరువయ్యారు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నడకదారి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



రుద్రగూడెం నుంచి మామిండ్లవీరయ్యపల్లి వరకు ఉన్న 33 ఫీట్ల లింకు రోడ్డును ఇరువైపుల ఉన్న రైతులు కబ్జా చేశారు. దీంతో పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఫిర్యాదు చేశాం. ఎవరు పట్టించుకోవడంలేదు. సమస్యను పరిష్కారించాలి.

\- మాసంపల్లి శంకర్ రావు, రైతు, రుద్రగూడెం

సమస్య పరిష్కరిస్తాం..



కబ్జా విషయంపై రుద్రగూడెం రైతులు ఇటీవల ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురైన దారిని పరిశీలిస్తాం. పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తాం. రైతులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

\- మంజుల, తహసీల్దార్, నల్లబెల్లి

పొదుపుతోనే ఆర్థిక స్వావలంబన



సంగెం: మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి



దుగ్గొండి: మాట్లాడుతున్న అధ్యక్షుడు నరహరి

సంగెం : పొదుపుతోనే మహిళలకు ఆర్థిక స్వావలంబన లభిస్తుందని ఎంపీపీ కళావతి అన్నారు. ఆదివారం మండలంలోని కుంటపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో అయ్యప్పస్వామి మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు సంఘంలో 19వ వార్షిక మహాసభ రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పొదుపు సంఘాల ద్వారా రుణాలు పొంది స్వయం కృషితో చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారాలు స్థాపించి ఆర్థికంగా ఎదిగి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పొదుపు సంఘం ఈ ఏడాది రూ.91,983లు లాభాలు ఆర్జించినట్లు నివేదిక చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కావటి వెంకటయ్య, సీసీ బొజ్జ సురేష్, వీఓఏ మాదవి, వార్డు సభ్యులు సంధ్యారాణి, సంఘం అధ్యక్షురాలు రమాదేవి, కార్యదర్శి యమునా, కోశాధికారి లత, ఉపాధ్యక్షురాలు సీత, సహాయ కార్యదర్శి రజిత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘం వార్షిక సభ

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేట గ్రామంలో మిర్చి రైతుల ఉత్పత్తి సంఘం వార్షిక సభ ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన లావాదేవీలు, వ్యాపార లాభ, నష్టాలను రాజుకుమార్‌రెడ్డి సభ్యులకు వివరించారు. తిమ్మంపేట చపాట మిర్చికి భౌగోళిక గుర్తింపును తీసుకువచ్చిన నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. అనంతరం సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నరహరి రాజుకుమార్‌రెడ్డి రెండోసారి ఎన్నిక కాగా ఉపాధ్యక్షుడిగా దొనపాటి ఇంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సొడారపు రవికుమార్, కోశాధికారిగా జటబోయిన అశోక్, సభ్యులుగా కొలిపాక సదానందం, దొనపాటి రాజేందర్‌రెడ్డి, పోశాల పాణి, పొదిల రాజేందర్, సొడారపు శోభన్‌బాబు, ఈదుల అశోక్, బోదె కరుణాకర్‌రెడ్డి, ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కేవీకే మహబూబాబాద్ శాస్త్రవేత్త భాస్కర్, సర్పంచ్ మోడెం విద్యాసాగర్, గణకుడు కోమాండ్ల రమణారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



మంత్రిని కలిసి బొకే ఇస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

రాయపర్తి : అమెరికా పర్యటన ముగించుకొని వచ్చిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును ఆదివారం మండల నాయకులు కలిసి పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల నాయకులు, సర్పంచ్‌ల ఫోరం, ఎంపీటీసీల ఫోరం నాయకులు మంత్రిని కలిసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహానాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, ఎండీ నయీం, రెంటాల గోవర్ధన్‌రెడ్డి, గారె నర్సయ్య, ఐత రాంచందర్, బండి అనూషరాజబాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన హోమం



రాయపర్తి : మండలంలోని సన్నూరు వెంకటేశ్వరపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నాల్గోవ మాస సుదర్శన హోమం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు ఆరుట్ల రంగాచార్యులు, రమణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా దంపతులకు, భక్తులకు స్వామివారి మంగళ శాసనములు అందజేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బాగు చేయండి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గిరిజన రైతులు

వర్ధన్నపేట : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తరచూ మరమ్మతులకు గురి కావడంతో రైతులు వేసుకున్న నారు మళ్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని శ్రీరామోజీకుమ్మరిగూడెం తండాలో ఎస్ఎస్-63 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని గిరిజన రైతులు తమ వ్యవసాయ పంపుసెట్లతో నారుమళ్లు పోసుకున్నారు. కాగా, యాసంగి సీజన్‌లో తరచూ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు రాగా చాలా ఇబ్బందులకు గురయ్యామని రైతులు వాపోతున్నారు. పదిహేను రోజుల క్రితం నారు పోసుకున్నామని ఇంతలోనే మళ్లీ కాలిపోయిందని వెంటనే మరమ్మతులు చేయకపోవడంతో నారుమడులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క సీజన్‌లోనే మూడు, నాలుగు సార్లు మరమ్మతులకు గురి కావడం లేదా కాలిపోవడం జరుగుతుందని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయంపై విద్యుత్ అధికారులను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యానికి మించి రైతులు పంపుసెట్లకు అనుమతి లేనివి సైతం వినియోగించడంతో ఈ పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు.

వనభోజనాలకు తరలిన స్థానికులు



కంఠమహేశ్వరుడికి పూజలు నిర్వహించి వనభోజనాలకు వెళ్తున్న మహిళలు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని గౌడ కులస్తులు ఆదివారం వనభోజనాలకు తరలివెళ్లారు. కంఠమహేశ్వరుడికి పూజలు నిర్వహించి చల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. పూజ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జోరు వీరయ్య, గౌరవ అధ్యక్షుడు జోరు మల్లయ్య, దొంతి శ్రీను, మాచర్ల ఎల్లగౌడ్, రమేష్, గొడిశాల సురేందర్, బొనగాల రమేష్, వడ్లకొండ రాజు, సంకటి చంద్రమౌళి, దొంతి సంతోష్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, గాదెగోని సాంబయ్య, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో పద్మశాలీ సంఘం, కుమ్మర సంఘాల సభ్యులు వన భోజనాలకు తరలి వెళ్లారు. వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించారు.

భిక్షాటనతో జీపీ కార్మికుల నిరసన



నెక్కొండ: మద్దతు తెలుపుతున్న కార్యదర్శులు



సంగెం: నినాదాలు చేస్తున్న కారోబార్లు, సిబ్బంది



చెన్నారావుపేటలో..



నర్సంపేట రూరల్: గుంటూరుపల్లిలో..



ఖానాపురం: బుధరావుపేట సర్పంచ్ వద్ద భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

నెక్కొండ : ఒప్పందాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందని గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షుడు భూక్యా నరేష్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరాయి. ఈ సమ్మెకు మండలంలోని గ్రామ కార్యదర్శులు సంఘీభావం తెలిపి, మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శులు సమ్మెకు మద్దతు తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా కార్మికుల సమస్యలను పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖానాపురంలో..

ఖానాపురం : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీ కార్మిక జేఏసీ అధ్యక్షుడు కాసు యాకయ్య ఆధ్వర్యంలో సర్పంచ్‌ల వద్ద మండల వ్యాప్తంగా భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్మికులు మేడిద అనిల్, కత్తి కుమారస్వామి, భిక్షపతి, ఉస్మాన్, ఉపేందర్, యాకుబ్, రవీందర్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

11వ రోజుకు చేరిన సమ్మె..

దుగ్గొండి : సమస్యలు పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరాయి. నెలకు రూ.19,000ల జీతం చెల్లించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు సమ్మె ఆపేది లేదని మండల జేఏసీ కన్వీనర్ గాదం రాజాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పొన్నం రమేష్, ముస్కు రాజు, పుట్టపాక రాజేందర్, కృష్ణమూర్తి, స్వామి, భిక్షపతి, సదయ్య, బచ్చయ్య, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలి

నర్సంపేట రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వమే వెంటనే పరిష్కరించాలని జీపీ కార్మికుల జేఏసీ మండల అధ్యక్షుడు పున్నం ఆనంద్ అన్నారు. నర్సంపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జీపీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 11వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం గుంటూరుపల్లెలో సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ రూ.3వేల సాయం అందించారు.కార్యక్రమంలో జీపీ జేఏసీ నాయకులు రాజేశ్వర్, జన్ను శ్రీను, యాకుబ్, కృష్ణ, చిన్న, సదానందం, మహేందర్, రమేష్ ఉన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన దీక్ష ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బదాసి అశోక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమ్మెలో మండల అధ్యక్షుడు దూడయ్య, పెల్లి రాజు, పాషా, పుటికల ప్రభాకర్, ఉపేందర్, వినయ్, శ్రీను, రమేష్, ఉపేందర్, శ్రీను, పూల్‌సింగ్, తదితరులు ఉన్నారు.

జీపీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలి

సంగెం : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్, ఇతర సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి పర్మనెంట్ చేయాలని గ్రామపంచాయతీ కారోబార్, సిబ్బంది జేఏసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పోశాల రమేష్, గుగులోత్ సుమన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. జీపీ కారోబార్లు, బిల్ కలెక్టర్లను పంచాయతీ కార్యదర్శికి అసిస్టెంట్‌గా నియమించాలన్నారు. కారోబార్లకు నెలకు రూ.19,500లు, సిబ్బందికి రూ.15,600లు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకూ నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. మండల కారోబార్, సిబ్బంది జేఏసీ నాయకులు దొనికెల వెంకటేశ్వర్లు, వల్లెం సుదన్‌రెడ్డి, జాటోత్ నరెందర్, రాజు, దశరథం, చలపతి, రవి, వెంకటేశ్వర్లు, కల్పన, రేణుక పాల్గొన్నారు.

రాయపర్తి : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు ఆదివారం భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కిరాణం, పలు షాపుల్లో భిక్షాటన చేశారు. ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు గూడెల్లి ఉప్పలయ్య డిమాండ్ చేశారు.

పేరుకే అగ్రిఫామ్స్.. చేసేది వెంచర్లు



నాచినపల్లిలో అగ్రిఫామ్స్ పేరిట ఏర్పాటు చేసిన వెంచర్

- ధరణిలో దర్జాగా రిజిస్ట్రేషన్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి..
- పట్టించుకోని అధికారులు, పాలకులు

దుగ్గొండి : సమాజంలో సులువుగా.. అతి తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించడానికి ఏకైక మార్గం రియల్ ఎస్టేట్ వ్యాపారం.. అయితే వ్యాపారంలో ఎక్కువ లాభాలు గడించడానికి రియల్టర్లు సరికొత్తదారులు వెతుక్కుంటున్నారు. ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా, పంచాయతీల నుంచి అనుమతి అవసరం లేకుండా.. గ్రీన్‌ల్యాండ్ పేరిట భూమి లాస్ కాకుండా సరికొత్తగా ఫామ్‌లాండ్ విధానాన్ని తెరపైకి తెచ్చారు. పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉన్న మైదాన భూముల్లో అగ్రిఫామ్స్ ఉంటాయని అందరికి తెలిసిందే. అయితే గ్రామాల్లోకఅగ్రిఫామ్స్ విధానం పాకింది. భూమిని కొనుగోలు చేసి దానిని వెంచర్‌గా కాకుండా అగ్రిఫామ్స్ అని చెప్పి గుంటల లెక్కన విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి నాలా పన్ను చెల్లించనవసరం లేదు. గ్రీన్‌లాండ్ కింద పంచాయతీలకు ఉచితంగా భూమి ఇవ్వాల్సిన అవసరం లేక పోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు..ఆరుకాయలుగా సాగుతోంది.

విచ్చలవిడిగా అగ్రిఫామ్స్.. వెంచర్లు

మండలంలోని నాచినపల్లి, చలపర్తి, తిమ్మంపేట, గిర్నిబావి, మందపల్లి గ్రామాల్లో ఎకరాల కొద్ది భూమిని కొనుగోలు చేసిన రియల్టర్లు అగ్రిఫామ్స్ పేరిట వెంచర్లు చేసి విక్రయిస్తున్నారు. అయితే వెంచర్‌లో ప్లాట్ కొనుగోలు చేసి ఇళ్ల నిర్మించుకోవాలంటే అనుమతి చాలా కష్టం అని తెలిసిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినపడుతున్నాయి.

ధరణి పోర్టల్ వరం..

ధరణి పోర్టల్ ద్వారా ఒక్క గుంట భూమి సైతం రిజిస్ట్రేషన్ చేసే అవకాశం ఉండటంతో రియల్టర్లకు అది అస్త్రంగా మారింది. భూమి కొనుగోలు చేసిన వారికి గుంటల లెక్కన రియల్టర్లు రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. తిరకాసు పెట్టే తహసీల్దార్‌లకు కానుకలు సమర్పించుకుని పనులు చేయించుకుంటున్నారని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు ఇచ్చాం..



అగ్రిఫామ్స్ పేరిట భూములను ప్లాట్లుగా విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి నోటీసులు ఇచ్చాం. వివరాలు అందించాలని సూచించాం. వ్యవసాయానికి కాకుండా ప్లాట్లుగా ఇంటి నిర్మాణాల కోసం విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. అగ్రిఫామ్స్‌లలో ప్లాట్లు కొని ఇళ్ల నిర్మించుకోవాలంటే పంచాయతీ నుంచి ఇంటి పర్మిషన్ తీసుకోవడం చాలా కష్టం. అగ్రిఫామ్స్‌లో ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేయొద్దు.

\- శ్రీధర్‌గౌడ్, మండల పంచాయతీ అధికారి

అన్ని మతాలకు సమ ప్రాధాన్యం

వరంగల్ : తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాలకు, కులాలకు సమ ప్రాధాన్యతనిస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. ఆదివారం మూడో డివిజన్ ఆరెపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న మసీద్ నిర్మాణానికి రమేశ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్ని మతాలు, కులాల వారికి సమ ప్రాధాన్యతనిస్తు వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జన్ను షీబారాణి, బీఆర్ఎస్ నాయకులు జన్ను అనిల్‌కుమార్, హరికృష్ణ, రాజు, బొల్లం విజయ్, ముస్లింలు, మసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి రూ.50కోట్లు

హసన్‌పర్తి : విలీన గ్రామాల అభివృద్ధికి మంత్రి కల్వకుంట్ల తారకరామారావు రూ.50 కోట్లు మంజూరు చేశారని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. 56వ డివిజన్ సుమారు రూ.2.25కోట్ల వ్యయంతో చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆదివారం భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేశారు.

కాంగ్రెస్, బీజేపీలది మోసపూరిత చరిత్ర

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : కాంగ్రెస్, బీజేపీలది మోసపూరిత చరిత్ర అని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఎమ్మెల్యే నివాస గృహంలో ఆదివారం పరకాల నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, రైతుబంధు సమితి కోఆర్డినేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు మూడు గంటల విద్యుత్ చాలు, ఉచిత విద్యుత్ వద్దన్న కాంగ్రెస్‌ను, రైతులను అన్యాయం చేస్తున్న బీజేపీని తరిమి కొట్టాలన్నారు. మంత్రి కేటీఆర్ ఆదేశానుసారం నేటి(సోమవారం) నుంచి క్లస్టర్ల వారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పదిరోజుల పాటు ఈ నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. సమావేశంలో ఎంపీపీలు మార్క సుమలతరజనీకర్, కాగితాల శంకర్, జెడ్పీటీసీలు కక్కెర్ల రాధికరాజు, గరిగె కల్పనకృష్ణమూర్తి, రైతుబంధు కోఆర్డినేటర్లు ఎన్కతాల్ల రవీందర్, బిల్లా రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.